జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 22-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 622 పేజీలు: 4 వెల : రూ.7

# కొండను తొలిచి.. కబ్జా!

* ప్రభుత్వ భూమిపై అక్రమంగా భవన నిర్మాణం
* రూ.30 లక్షల ప్రభుత్వ స్థలం హాంఫట్
* కొందరు టౌన్ ప్లానింగ్ అధికారుల అండతోనే దందా
* అడ్డుకోకుంటే మరిన్ని స్థలాలు ఆక్రమణకు గురయ్యే అవకాశం



పలాస, మార్చి 21 (వార్త): పలాస పట్టణంలో అక్రమ నిర్మాణాల దందా మరోసారి వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి, కొండను తొలిచి భవనం నిర్మిస్తున్న ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. హుద్‌హుద్ ఇళ్ల సమీపంలోని నెమలికొండ రెవెన్యూ విలేజ్ పరిధిలో ఈ అక్రమం సాఫీగా సాగుతోంది. పూర్తిగా ప్రభుత్వానికి చెందిన భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా, చట్టబద్ధమైన పత్రాలు లేకుండానే నిర్మాణ పనులు కొనసాగుతుండడం గమనార్హం. ఇంటి పునాది కోసం తవ్విన గోతులను పూడ్చేందుకు సమీపంలోని కొండను తవ్వి తీసుకొచ్చిన కంకరతో నింపుతూ పనులు వేగంగా సాగుతున్నాయి.

### అధికారుల అండతోనే అక్రమం..

ఈ అక్రమ నిర్మాణం వెనుక కొందరు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ద్వారా భారీగా డబ్బులు వసూలు చేసి ఈ భవన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికుల అంచనా ప్రకారం, సుమారు రూ.30 లక్షల విలువ చేసే



ప్రభుత్వ భూమిని ఆక్రమించి భవనం నిర్మించేస్తున్నారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇటువంటి అక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో మరిన్ని ప్రభుత్వ భూములు ఇదే తరహాలో కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### తహశీల్దార్ ఏమన్నారంటే..

ఈ విషయమై పలాస తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తిని వివరణ కోరగా, విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసేలా చూస్తామన్నారు. నిబంధనల ప్రకారం కట్టడాన్ని తొలగిస్తామని స్పష్టం చేశారు.



## పేద కుటుంబంపై కిడ్నీ పిడుగు

* వ్యాధితో కుటుంబ పెద్ద మృతి
* అనాధగా మారిన కుటుంబం

**కంచిలి, మార్చి 21 (వార్త):** కిడ్నీ వ్యాధితో కంచిలి మండలం పద్రి పుట్టుగ గ్రామంలో శుక్రవారం రాత్రి పద్రి భాస్కరరావు (40) మృతి చెందారు. కూలి పనులపై ఆధారపడి బతికే కుటుంబంపై పిడుగు పడినట్లుగా కటుంబ పెద్దను కిడ్నీ వ్యాధి కాటేయడంతో భార్య పిల్లలు ఆనాధలుగా మారారు. 2021 నుంచి భాస్కరరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, పలాసలలో వైద్యం పొందుతూనే ఉన్నారు. చివర్లో బీపీ పెరిగిపోవడం దానికి తోడు ఆయాసం మరింతగా పెరగడంతో తట్టుకోలేక భాస్కరరావు తుది శ్వాస విడిచాడు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో కుటుంబ పెద్దను కోల్పోయిన భార్య కుమారి, ఏడవ తరగతి చదువుతున్న కుమార్తె రేష్మ పరిస్థితి అయోమయంగా మారింది. ఇప్పటికే ఏళ్ల తరబడి ఆసుపత్రుల చుట్టూ తిరిగి వైద్యం కోసం విపరీతంగా అప్పుల పాలయ్యారు. అయినా సరే వ్యాధి నయం కాక మనిషి దక్కకుండా పోవడంతో బాధిత కుటుంబీకుల పరిస్థితి ఎంతో దయనీయంగా మారింది. ఇటువంటి నిరుపేద కుటుంబాన్ని మనసున్న మారాజులు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## ఒకే గదిలో.. ఐదు తరగతులు!

* శిథిలావస్థలో హడ్కో కాలనీ పాఠశాల
* బిక్కుబిక్కుమంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు
* భయాందోళనలో ఉపాధ్యాయులు



**నరసన్నపేట, మార్చి 21 (వార్త):** నరసన్నపేట హడ్కో కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 36 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారు. పాఠశాలలో ఉన్న రెండు తరగతి గదుల్లో ఒకటి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మిగిలిన ఒక్క గదిలోనే అన్ని తరగతులు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని హెడ్‌మాస్టర్ రజనీ కుమారి వద్ద ప్రస్తావించగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న గది కూడా శిథిలావస్థలోనే ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు బోధన నిర్వహించడం కష్టంగా మారిందని చెప్పారు. భవనం బలహీనంగా ఉండటంతో విద్యార్థులు భయాందోళనల మధ్య చదువుకుంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొత్త తరగతి గదులను నిర్మించాల్సిందిగా తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

## అమరవీరుల త్యాగాలకు చిహ్నం.. కార్గిల్ విక్టరీ పార్క్

* కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
* శ్రీకాకుళంలో రూ.2 కోట్లతో సుడా ఆధ్వర్యంలో నిర్మాణం




4లో

# 58 కోట్లతో.. అరసవల్లి క్షేత్రం అభివృద్ధి

* రూ.4 కోట్లతో ఇంద్రపుష్కరిణి పునరుద్ధరణ
* ప్రసాద్ స్కీమ్ ద్వారా ఆదిత్యుని ఆలయాభివృద్ధికి ప్రతిపాదనలు
* కూటమి ప్రభుత్వంతోనే ఆధ్యాత్మిక వైభవం
* కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
* పుష్కరిణి పనులకు రాష్ట్ర మంత్రి అచ్చెన్నతో కలిసి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి






**అరసవల్లి, మార్చి 21 (వార్త):** ప్రపంచ దేశాల నుంచి భక్తులు తరలివస్తున్న ప్రసిద్ధ అరసవల్లి క్షేత్రాన్ని కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం ద్వారా రూ.58 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అరసవల్లి క్షేత్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కృషితో ఇప్పటికే



పుష్కరిణి పనులకు రూ.4కోట్లు మంజూరయ్యాయని, కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం కింద మరో రూ.58 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా అత్యాధునిక వంటశాల, భోజనశాల, భక్తుల కోసం వసతి గృహాలు, విశాలమైన రహదారులను నిర్మిస్తామన్నారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టి త్వరలోనే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అరసవల్లి రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నాటి నుంచి భక్తుల తాకిడి గణనీయంగా పెరిగిందని, దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారని మంత్రులు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో విశాలమైన రహదారులు, సెంటర్ లైటింగ్ పనులను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక హబ్‌లుగా మార్చడమే లక్ష్యమని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వీడి కూటమి హయాంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును సత్కరించిన కోనే శ్రీధర్



**శ్రీకాకుళం, మార్చి 21(వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సభ్యుడు కోనే శ్రీధర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మంత్రిని సత్కరించారు.

శనివారం ఉదయం స్థానిక కేంద్ర మంత్రి క్యాంప్ కార్యాలయంలో దుశ్శాలువ కప్పి, జ్ఞాపిక, పుష్ప గుచ్ఛములతో హిందీ మంచ్ సభ్యులతో కలిసి మంత్రిని శ్రీధర్ సత్కరించారు.

కేంద్రమంత్రికి హిందీ ప్రచార సభ డైరీని సభ్యులు బహూకరించారు. ఈ సందర్భంగా కోనే శ్రీధర్ ను మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో హిందీ మంచ్ జిల్లా అధ్యక్షులు కనుగుల సత్యం, ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరీష, గౌరవాధ్యక్షులు దొంతం పార్వతీశం, జోనల్ కోశాధికారి ఎం.వి. మల్లేశ్వరరావు, సభ్యులు ఆర్. ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

**-నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచన**


**-ప్రజాదర్బార్‌లో సమస్యలకు పరిష్కారం**

**పార్టీ తరఫున రూ.2 లక్షల బీమా చెక్కును ఎన్.లక్ష్మి కుటుంబానికి అందజేసిన మంత్రి**



**కోటబొమ్మాళి(నిమ్మాడ), మార్చి 21(వార్త):** ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, 20 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ కాలంలో మంజూరైన గృహ నిర్మాణాలు మధ్యలో ఆగిపోయిన విషయమై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఆగిపోయిన ఇళ్ల పనులను మళ్లీ ప్రారంభించి పూర్తి చేస్తే, సంబంధిత బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందని మంత్రి లబ్ధిదారు లకు స్పష్టం చేశారు. కోటబొమ్మాళికి చెందిన లక్ష్మి కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.2లక్షల భీమా చెక్కును మంత్రి అందజేశారు. ప్రతి కార్యకర్తకి ప్రభు త్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు వస్తాయని లబ్ధిదారులకు మంత్రి హామీ ఇచ్చారు. అర్హులందరికీ కొత్త పింఛన్లు త్వరలోనే మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల నాయకులు పాల్గొన్నారు.

## 26 నుంచి పల్లి సారథిలో ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వాన నాటిక పరిషత్ పోటీలు




**పలాస, మార్చి 21(వార్త):** ప్రపంచ నాటకరంగ దినోత్సవం, శ్రీరామనవమి సందర్భంగా వజ్రకొత్తూరు మండలం పల్లి సారథిలో ఈ నెల 26, 27, 28వ తేదీల్లో ఉత్త రాంధ్ర స్థాయి ఆహ్వాన నాటిక పరిషత్ పోటీలు శ్రీరామ నవమి కమిటీ సౌజన్యంతో నిర్వహిస్తున్నామని నాటిక పరిషత్ కమిటీ సభ్యులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, డాక్టర్ కుమార్‌నాయక్, అంగ ఆనంద్, పీస ఈశ్వరరావు, పోతనపల్లి జానకిరరావు తెలిపారు. బోరివంక వారి కొత్త పరిమళం, శ్రీకాకుళం వారి మతమా మానవత్వమా, డోకుల పాడు వారి కురుక్షేత్రం, విశాఖపట్నం వారి దొందు దొందే, బొబ్బిలి రాజాశ్రీ వారి కెరటాలు వంటి నాటికలు ఈ పోటీల్లో ప్రదర్శిస్తారన్నారు. నాటికల్లో 19 విభాగాల్లో అవార్డుల ప్రదానం చేస్తామని, పాల్గొన్న ప్రతి నాటికకు ప్రదర్శన పారితోషికం అందజేస్తామని తెలిపారు. పల్లి సారథి వారి ఏం పిల్లడో నాటిక ప్రత్యేక ప్రదర్శనగా ఉంటుందని, పరిసర నాటకాభిలాషులు, కళాకారులు, కవులు పాల్గొని ప్రపంచ నాటక రంగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## ఆదిత్యుని అన్నదానానికి రూ.1,00,116ల విరాళం



**అరసవల్లి, మార్చి 21(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి అన్నదాన పథకానికి శ్రీకాకుళం వాస్తవ్యులు శిమ్మ అచ్యుత రామ్, సూర్యలక్ష్మి దంపతులు శనివారం రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. శనివారం వారు ఆ చెక్‌ను ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్‌శర్మ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు అందించారు. వీరిని ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారి స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. డిప్యూటీ కమిషనరు, కార్యనిర్వహణాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

## నేత్రదానం మరొకరి జీవితానికి వెలుగు



**శ్రీకాకుళం, మార్చి 21(వార్త):** "నేత్రదానం" మరొకరి జీవితానికి వెలుగు అని, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక మండలవీధికి చెందిన ఊన్న . గోవిందరావు (74) తనువు చాలించగా, వారి నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకోవడం మహోత్తర ఆలోచన అన్నారు. ఆయన కుటుంబ సభ్యులు కుమార్తె బరాటం ధనలక్ష్మి, అల్లుడు బి.ప్రభాకర్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, పి.చిన్నికృష్ణ .. మృతుడి కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారన్నారు. మృతుడి కుటుంబసభ్యులను రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కోశాధికారి కె.దుర్గాశ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేత్రదానం చేయాలనుకునే వారు 7842699321కు సంప్రదించాలని కోరారు.

## కిడ్నీ బాధితులకు శివాజీ, శిరీష ఆర్థికసాయం



**పలాస, మార్చి 21 (వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష.. కిడ్నీ బాధితులకు మానవతా దృక్పథాన్ని చాటారు. సోంపేటకు చెందిన మల్లా ప్రతాప్, నర్మదా దంప తులు, వారి కుటుంబ సభ్యులకు శనివారం ఆమె ఆర్థిక సహాయం అందజేశారు. కష్టాల్లో ఉన్న ఒక బిడ్డను ఆదుకోవడానికి వారు చూపిన ఈ ఉదారత నిజంగా ప్రశంస నీయం. ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములైన ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ బాధితులకు అండగా నిలబడటం ఆ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని కలిగించింది. కిడ్నీ మార్పిడి వంటి ఖరీదైన శస్త్రచికిత్స జరిగిన సమయంలో ఇలాంటి ఆర్థిక సాయం హేమశ్రీ కుటుంబానికి పెద్ద ఊరటని ఎమ్మెల్యే గౌతు శిరిష తెలిపారు రూ.80,000లు ఎమ్మెల్యే గౌతు శిరిష, మాజీమంత్రి గౌతు శివాజీ .. హేమశ్రీ కుటుంబ సభ్యులకు అందజేశారు. హేమశ్రీ త్వరగా కోలుకోవాలని, ఆ కుటుంబం మళ్లీ చిరునవ్వుతో ఉండాలని ఆకాంక్షించారు.

## భవనంపై నుంచి జారి పడి కార్మికుడి మృతి



**పలాస, మార్చి 21 (వార్త):** పలాసలో విషాదం చోటుచేసుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడులో తర్లాన సంజీవరావు భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ పైఅంతస్తు నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడిని పలాసలోని ఉదయపురానికి చెందిన సత్యం కృష్ణారావు (40)గా గుర్తించారు. సుమారు 40 అడు గుల ఎత్తు నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఆయన భార్య సరిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భద్రతా చర్యలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## విప్లవోద్యమం ఆగదు : ప్రకాష్



**నరసన్నపేట, మార్చి 21 (వార్త):** అసమానతలు ఉన్న చోట ఉద్యమాలు సహజమని, అరెస్టులు, నిర్బంధాలతో విప్లవోద్యమాన్ని అణచివేయలేమని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ తెలిపారు. కోమర్తిలో శనివారం కామ్రేడ్ మామిడి అప్పసూరి 29వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతలపై పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రజల హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమాలను అణచివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయినప్పటికీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యూడెమోక్రటిక్ పార్టీ సభ్యులు నీలం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులను కాపాడుకుందాం




**మందస, మార్చి 21(వార్త):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారానే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) పిలుపునిచ్చింది. మందస మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిని కాపాడుకుందాం అనే నినాదంతో నిర్వహించిన ఆటోజాతా బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ముందుగా హరిపురం అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ బోర్డ్ డైరెక్టర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శి జయరాంమాలి, సీఐటీయు మండల గౌరవ అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు జెండా ఊపి ఆటో జాతాను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు గున్న రమేష్, దాసరి ఈశ్వరరావు, నల్ల హడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే ప్రభుత్వ బడులే శరణ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు ఉన్నాయని ప్రజలకు వివరించారు. ఊరు వాడ గ్రామ గ్రామాన ప్రచారం జాతా మండలంలోని హరిపురం, బాలిగాం, మందస, బైరిసారంగపురం, కొత్తపల్లి, సొండిపూడి పలు గ్రామాల్లో పర్యటించింది. అంబుగాశీ, లింబుగాం, నారాయణపురం, కేసుపురం, బహడపల్లి, రట్టి గ్రామాల్లో యూటీఎఫ్ ఉపాధ్యాయ బృందం డోర్ టు డోర్ ప్రచారం నిర్వహిస్తూ, బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అక్షరం ఆయుధం – బడిబాట మన మార్గం అనే నినాదంతో సాగిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జగదీష్ బడిత్య, గౌరవ అధ్యక్షుడు జన్ని సోమేశ్వరరావు, సహాధ్యక్షుడు డి.కిరణ్, పూర్వపు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నింటి కొండల రావు, కొర్ల సోమేశ్వరరావు, సార భాస్కరరావు, జిల్లా కౌన్సిలర్లు తరణి సోమేశ్వరరావు, గున్న రాజు, గున్న చంద్రశేఖర్, పాలిన సాయికుమార్, రెయ్యి కృష్ణారావు , మజ్జి శివకేశ్వర రావు, ప్రజా విజ్ఞాన వేదిక కన్వీనర్ మార్పు జగన్మోహన్రావు, మామిడి కోదండరావు, ఉపాధ్యాయులు రత్నాల సోమేశ్వరరావు, బాలార్జున పాత్రో, మల్లేశ్వరరావు, జి.కృష్ణారావు, ఎస్.లోకనాథం, కె.పద్మ, ఎన్.మురళి, విద్యాభిమానులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో రంజాన్ వేడుకలు

**-జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు**



**నరసన్నపేట, మార్చి 21 (వార్త):** నరసన్నపేటలోని జామియా మసీదులో ఉపవాస దీక్షలు ముగిసిన సందర్భంగా రంజాన్ పర్వదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిమంది ముస్లిం సోదరులు నరసన్నపేటతో పాటు పరిసర గ్రామాల నుండి తరలి వచ్చారు. మత గురువు పరహాత్ ఆధ్వర్యంలో ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ వేడుకల్లో చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మసీదు పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## కరవంజ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

**-ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీల్లో ప్రవేశాలు**

**- ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**



**జలుమూరు, మార్చి 21 (వార్త):** కరవంజలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు. పదవ తరగతి మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారని కళాశాల వర్గాలు తెలిపాయి. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వారు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ ఏప్రిల్ 30గా నిర్ణయించారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు పూర్తి వివరాల కోసం ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, కరవంజను లేదా 9440322964 నంబర్‌కు సంప్రదించవచ్చని సూచించారు.

## ఈదుపురంలో ఇల్లు దగ్ధం

**ఇచ్ఛాపురం, మార్చి 21(వార్త):** ఈదుపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కీర్తిచంద్ర బెహరా ఇంట్లో షార్ట్ సర్క్యూట్ సంభవించి ఇల్లు దగ్ధమైంది. ఆయన భార్య పొరుగింటికి వెళ్లగా, ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి మంట లను అదుపులోకి తీసుకుని వచ్చారు. ఇంట్లోని విలువైన వస్తువులతో పాటు రూ.లక్ష, బంగారం పూర్తిగా కాలిపోయాయి. లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని కీర్తిచంద్ర కన్నీటిపర్యంతమయ్యారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు.



## ఉద్యోగ క్యాలెండర్‌తో యువతకు మేలు



**మందస-పలాస, 21 మార్చి (వార్త):** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026 ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయడం రాష్ట్ర యువతకు గొప్ప శుభవార్తగా నిలిచిందని పలాస ప్రాంతానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్(తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్) నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేస్తూ, ఈ ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేయడం ద్వారా యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని తెలిపారు. ఈ క్యాలెండర్ ద్వారా 10,060పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రణాళిక రూపొందించడం యువతలో నమ్మకాన్ని పెంచుతుందని అన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ ప్రతీ సంవత్సరం ఉగాది రోజున ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఈ క్యాలెండర్ ప్రకారం మే నుండి అక్టోబర్ 2026 వరకు పాఠశాల విద్యాశాఖ, పోలీసు శాఖ, ఇంజినీరింగ్, ఇతర ప్రభుత్వ విభాగాల్లో నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం లోక్‌సభ సభ్యుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చేస్తున్న కృషిని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అభినందించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభివృద్ధికి దోహదం చేస్తాయని వారు తెలిపారు. ప్రత్యేకంగా శ్రీకాకుళం జిల్లా యువతకు ఈ ఉద్యోగ అవకాశాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ.. ఉద్యోగార్థులు ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంప్లాయ్ మెంట్ పోర్టల్‌లో నమోదు చేసుకుని రాబోయే నోటిఫికేషన్లకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలాస కాన్స్టెన్సీ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తిని తారకేశ్వరరావు, సార నిరంజన్, గంగిట్ల పాపారావు, నగిరి గోవిందు, బత్తిని ఉదయ్ కిరణ్, బురద కిషోర్ తదితరులు ఉన్నారు.

## బ్రాహ్మణతర్ల ప్రీ ప్రైమరీ అంగన్‌వాడీ కేంద్రంలో అగ్ని ప్రమాదం

**పలాస, మార్చి 21 (వార్త):** బ్రాహ్మణతర్ల గ్రామం చాకలి వీధిలో అంగన్వాడి ప్రీ ప్రైమరీ స్కూల్ సెంటర్లో రేకుల షెడ్‌లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు చెల్లరేగాయి. పెద్దగా ఆస్తి నష్టం జరగలేదు. అంగన్‌వాడీ టీచర్.. కాశీబుగ్గ సీఐ రామకృష్ణకి ఈ విషయం తెలియజేయగా, వెంటనే కానిస్టేబుల్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. కాల్ సెంటర్ 112 సమాచారం తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది శేఖర్ వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఆస్తి నష్టం పరిశీలించి, అంచనా వేశారు. 4 ప్లాస్టిక్ చైర్స్, టోయ్ బొమ్మ,, ప్లాస్టిక్ శాలిటేషన్ డబ్బాలు, ప్లాస్టిక్ చిల్డ్రన్ టేబుల్స్ అగ్ని ప్రమాదానికి గురైనట్టు గుర్తించారు. ఈ సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వడ్డీ యాదగిరి, పలాస యూనిట్ కో కన్వీనర్ ఆళ్ల కృష్ణారావు, గ్రామ అధ్యక్షులు బమ్మిడి ఆనంద్, పలాస పీఏసీఎస్ డైరెక్టర్ రఘుపాత్రుని సుదర్శన్ రావు, శాసనసభ వెంకట్రావు, అధికారులు పరిశీలించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గెడ్డలో పడి ఒకరి మృతి

### -ఇప్పటికే మృతుడు అదృశ్యమైనట్టు ఫిర్యాదు

**మందస, మార్చి 21(వార్త):** డిమిరియా గ్రామం సమీపంలో సునాముది గెడ్డలో పడి ఒకరు మరణించారు. మందస మండలంలోని జిల్లుండ పంచాయతీలో గల డిమిరియా మీదుగా సునాముది గెడ్డలో ఓ మృతదేహం కనిపించింది. సుమారు మూడు రోజుల క్రితమే నీటిలో మునిగి మృతి చెందినట్టు అనుమానిస్తున్నారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మందస ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు మందస మండలంలోని అంబుగాం గ్రామానికి చెందిన గుడియా జగన్నాథం (47)గా గుర్తించారు. కాగా.. జగన్నాథం కనిపించడంలేదని గత నెల 2నుంచి కనిపించడంలేదని మృతుని కుమార్తె భవాని ఇప్పటికే ఫిర్యాదు కూడా చేయడంతో అప్పటి నుంచి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కుమార్తె భవాని గుర్తు పట్టడంతో మిస్సింగ్ కేసు నుంచి అన్ నేచురల్ డెత్ కింద అల్టానేషన్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు. అంబుగాం వద్ద జగన్నాథం తోపుడు బండి వ్యాపారం చేసుకుంటున్నాడు. కుటుంబ కలహాలు ఉన్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఈ ప్రాంతంలోనే జగన్నాథం కనిపించాడని, కొంతమంది రైతులతో కూడా మాట్లాడినట్టు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.



## గోవిందపురంలో సోషల్ ఆడిట్



**పలాస, మార్చి 21 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం పంచాయతీలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ శనివారం పాల్గొన్నారు. గ్రామంలో అమలు అవుతున్న ఉపాధి హామీ పనులను, వాటి నాణ్యతను, ఖర్చుల వినియోగాన్ని సమీక్షించారు. కార్మికులకు అందుతున్న వేతనాలు, పనుల పారదర్శకత, లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాలపై అధికారులు, ప్రజలతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా పుచ్చ ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న శ్రామికులు ఉపాధి పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి రూపాయి సరైన విధంగా వినియోగం కావాలని, పనుల్లో నాణ్యత ఉండాలని అధికారులకు సూచించారు. కర్ని రమణ మాట్లాడుతూ గ్రామ ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సోషల్ ఆడిట్ ద్వారా పారదర్శకత పెరిగి, అవినీతి తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ, సెక్రటరీ శరత్, ఉపాధి శ్రామికులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీతమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి

### -గ్రామాల్లో యూటీఎఫ్ ప్రచారం -తల్లిదండ్రులకు అవగాహన



**నరసన్నపేట, మార్చి 21 (వార్త):** యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో "మన ఊరు బడిని కాపాడుకుందాం" కార్యక్రమం భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం బసివలస, అంపలాం, రెడ్డికపేట గ్రామాల్లో ఉపాధ్యాయ బృందంతో కలిసి తల్లిదండ్రులను కలుసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం మెరుగైన విద్యా బోధన అందుతుందని తల్లిదండ్రులకు వివరించారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అది డూప్ క్యాలెండర్ : బమ్మిడి

**పలాస, మార్చి 21 (వార్త):** అది జాబ్ క్యాలెండర్ కాదు.. డూప్ క్యాలెండర్ అని, జాబ్ క్యాలెండర్ పేరుతో మరోసారి నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మోస గించిందని, ముఖ్యంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని విస్మరించారని వైయస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు ధ్వజమెత్తారు. శనివారం పలాసలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20



లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, వీరిలో చాలామంది భారీ స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తాయన్న ఆశతో వివిధ ప్రాంతాలలో కోచింగ్ సెంటర్ల ద్వారా కోచింగ్ పొందుతున్నారని వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను చూసిన వెంటనే నిరుద్యోగులకు తీవ్ర నిరాశ ఎదురైందని, వాళ్ల భవిష్యత్తుపై ఆందోళనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. బాబు వస్తే జాబు వస్తుందని నిరుద్యోగులతో ఓట్లు వేయించుకున్నారని, తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలను అడియాసలు చేశారని ఆయన విమర్శించారు. తక్షణమే 50వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ప్రభుత్వం ప్రకటించాలని, నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం విఫలం : ఏఐవైఎఫ్

**శ్రీకాకుళం, మార్చి 21 (వార్త):** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నప్పటికీ నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అఖిల భారత యువజన సమాఖ్య() రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ విమర్శించారు. శ్రీకాకుళం క్రాంతి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి కేవలం పదివేల ఉద్యోగాలతో క్యాలెండర్ విడుదల చేయడం దురదృష్టకరమని అన్నారు. వెంటనే ప్రస్తుత జాబ్ క్యాలెండర్‌ను రద్దు చేసి లక్ష ఉద్యోగాలతో కొత్త క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 2.3 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. ఈ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థల పనితీరుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి పురోగతి సాధించలేదని అన్నారు. నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, ఏఐవైఎఫ్ నాయకులు ఆర్ అరవింద్, వసంతరావు, సంతు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.




# యువతకు ఉగాది కానుక జాబ్ క్యాలెండర్

### -ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, మార్చి 21 (వార్త):** యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో శనివారం తెలియజేశారు. ఇప్పటికే 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిందని, వీటితో పాటు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడిలో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం జరిగిందని, శ్రీ ప్రభవ నామ సంవత్సరం కానుక భారీగా ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్రంలోని యువతకు బంగారు భవిష్యత్ అందించేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించింది. జాబ్ క్యాలెండర్లో ప్రధానంగా విద్య, పోలీస్ శాఖలకు పెద్దపీట వేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీగా టీచర్ పోస్టులను భర్తీ చేసింది. నేడు మరోసారి డీఎస్సీని, జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం 3,000 ఖాళీలను కేటాయించిందని, ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,500 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తుందని, పరిపాలనా విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం దాదాపు 600 పోస్టులతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్జిక్యూటివ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని అన్నారు. నోటిఫికేషన్ విడుదల నుండి పరీక్షణ నిర్వహణ, ఫలితాల వెల్లడి, నియామక ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశకూ ఈ క్యాలెండర్లో నిష్టమైన గడువులను ప్రభుత్వం నిర్ణయించిందని, అభ్యర్థులు ఎటువంటి గందరగోళం లేకుండా తమ ప్రిపరేషన్ ను ప్రణాళికాబద్ధంగా కొనసాగించే వీలు కలుగుతుందని తెలిపారు రు. "జాబ్ క్యాలెండర్ అంటే కేవలం ప్రకటన మాత్రమే కాదు, అది నిరుద్యోగులకు ఇచ్చే ఒక భరోసా" అనే సదుద్దేశంతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించడం జరిగిందని, పారదర్శకంగా, వేగవంతంగా నియామక ప్రక్రియ చేపట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటివరకు జరిగిన ఉద్యోగాల లక్ష్యం అని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలు 30,607 - డీఎస్సీ, కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఎంఎస్ఎంఈల నుండి ఉపాధి 2,48,906, జాబ్ ఫెయిర్, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 1,46,627, పరిశ్రమల రంగం - 95,174, ఫుడ్ ప్రాసెసింగ్ - 64,035, ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ - 13,866, పర్యాటక రంగం అభివృద్ధి కోసం 5,028, ఈ విధంగా కేవలం 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిన యువత భవిష్యత్ ను నాశనం చేసిన జగన్ ఎన్నికలకు ముందు 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అన్న జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొట్టగా రాష్ట్రానికి పరిశ్రమలు పెట్టుబడులు తీసుకురాకపోగా కమీషన్ల కోసం ఉన్న కంపెనీలను తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్ ను నాశనం చేసిందని, జగన్ పాలనలో యువత ఉద్యోగాలు, ఉపాధి లేక వేలాదిమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిరుద్యోగ పకారం గాడ్విజెట్లలో 24 శాతం నిరుద్యోగంతో దేశంలోనే ఏపీ పదవ స్థానంలో నిలిచింది. జగన్ పాలనలో విడుదల చేసిన ఎన్ఎస్ఆర్సి నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఉపాధి లేక 4,100 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు



పాల్పడ్డారు. చంద్రబాబు నాయుడు విద్యార్థి, యువతకు అన్ని విధాల అండగా నిలిస్తే జగన్ రెడ్డి మాత్రం తన అవినీతి, అరాచక పాలనతో విద్యార్థి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి యువత భవిష్యత్ ని ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు.

## మంత్రి అచ్చెన్నను కలిసిన మెప్మా పీడీ శైలజ



**కోటబొమ్మాళి(నిమ్మాడ), మార్చి 21(వార్త):** శ్రీకాకుళం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ బొడ్డేపల్లి శైలజ నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ పేదరిక నిర్మూలన పేదల సంక్షేమం, మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన, యువతకు ఉపాధి అవకాశాల పెంపు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మెప్మా ద్వారా అమలు అవుతున్న పథకాలు పట్టణ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని శైలజ ఆయనకు తెలిపారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, సూక్ష్మ వ్యాపారాల ప్రోత్సాహం,రుణ సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. మెప్మా ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహాయం అందిస్తుందని, పట్టణ పేదరిక నిర్మూలనలో మరింత ఫలితాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

## పలాసలో కుక్కల బీభత్సం

### -నలుగురిపై దాడి

### అధికారులు చర్యలు తీసుకోవాలంటూ పట్టణవాసుల డిమాండ్

**పలాస, మార్చి 21 (వార్త):** పలాసలో కుక్కల బీభత్సం కలకలం రేపింది. కేటీ రోడ్డులో మూకుమ్మడిగా దాడి చేసిన కుక్కలు కోట్ని అభిలాష్, సేనాధిపతి ప్రకాశరావు, జుత్తు చంద్రశేఖర్‌ను తీవ్రంగా గాయపరిచాయి.మరో వైపు కాపు వీధిలో తామాడ అమ్ములకు కుక్క కరవడంతో గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి బాధితులను పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కుక్కలు విచ్చలవిడిగా



తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## వంశ'ధార' మందస శివారు భూములకు అందేవరకు పోరాటం

### -ఏప్రిల్ 1న జెండా, పోస్టర్ ఆవిష్కరణ

### -సాగునీరు సాధన కమిటీ వెల్లడి

**మందస, మార్చి 21(వార్త):** వంశధార జలాలు మందస చివర భూములకు అందేవరకు పోరాటం కొనసాగుతుందని సాగునీరు సాధన కమిటీ అధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు అధ్యక్షతన జరిగింది. ఆయన అధ్యక్ష ఉపన్యాసం చెబుతూ ప్రతీ ఏడాది రైతాంగం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటూ సాగునీటి అవసరాల కోసం ఆకాశం వైపు చూసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార జలాల సాధనే లక్ష్యంగా పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని ఆయన అన్నారు. ఏప్రిల్ 1వ తేదీన అమరజీవి వీరగున్నమ్మ స్మృతి నివాళి అర్పిస్తూ, అనంతరం వంశధార సాధన కమిటీ జండా, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని రైతులందరూ కదలి రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ వంశధార జలాలు పలాస మండలం వరకు వచ్చాయని



వాటిని వాటిని మందసా వరకు పొడిగించే అవకాశం ఉన్నప్పటికీ పాలకవర్గాలు నమ్మకు నేరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార సాగునీరు సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకట్రావు, నల్ల హడ్డి, కొర్ల రామారావు చౌదరి, చింతాడ గణపతి, అంపోలు త్రినాధ్, మజ్జి రమణారావు, వెదుళ్ళ మాధవరావు, వాయలపల్లి వరప్రసాదరావు, శశిధర వర్మ, సింహాద్రి, జయరాం, కొర్ల పాపారావు, సాలిన రామారావు పాల్గొన్నారు.

## పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి

### - రైతుల ఆదాయం పెంపులో పశు సంవర్ధక రంగం కీలకం

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

### - మెగా పశు వైద్య శిబిరానికి శ్రీకారం

**జలుమూరు, మార్చి 21 (వార్త):** పాడి పరిశ్రమను అభివృద్ధి చేసే దిశగా పాడి రైతులతో పాటు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పాగోడు గ్రామంలో నిర్వహించిన మెగా పశు వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల ఆర్థికాభివృద్ధిలో పశుసంవర్ధక రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు రైతులకు అదనపు ఆదాయ వనరుగా నిలుస్తున్నాయని, వాటి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరమని అన్నారు. ఇలాంటి ఉచిత పశు వైద్య శిబిరాల ద్వారా రైతులకు మంచి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పశువులకు సమయానికి వైద్య సేవలు అందించడం ద్వారా వ్యాధులను నివారించడంతో పాటు పాల ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని వివరించారు. ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఈ శిబిరంలో పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఉపాధి హామీ నిధులతో రహదారి వేగవంతం



**పోలాకి, మార్చి 21 (వార్త):** చెల్లయ్యవలస పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో రహదారి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కృషితో రూ.2 కోట్లు నిధులు మంజూరు అయినట్లు గ్రామస్తుడు బోర వెంకటరావు తెలిపారు. ఇప్పటికే సుమారు 75 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తయితే గ్రామస్థులకు రాకపోకలు సులభతరం అవుతాయన్నారు. గ్రామాభివృద్ధి దిశగా ఇలాంటి పనులు చేపడుతున్నందుకు స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## రంజాన్ ప్రత్యేక నమాజులో ఎమ్మెల్యే శంకర్



**శ్రీకాకుళం, మార్చి 21(వార్త):** శ్రీకాకుళం నగరం జి.టి.రోడ్డులో గల జామియా మసీదులో శనివారం జరిగిన రంజాన్ ప్రత్యేక నమాజులో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. జామియా మసీదు ఇమామ్ ఎండి. జియావుర్ రెహమాన్ ప్రత్యేక నమాజు (ఈద్-ఉల్-ఫితర్) చదివించారు. అనంతరం యావత్ మానవాళి ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, అష్ట ఐశ్వర్యాలు కలగాలని అల్లాకు (భగవంతుడికి) ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి ప్రాచీన, పెద్దదైన జామియా మసీదు తన నియోజకవర్గంలో ఉండడం అదృష్టం అని, ఈ మసీదు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, త్వరలోనే అంతర్గత రహదారులు, సోలార్ లైట్స్, ప్రహరీ గోడ మరమ్మతులు, ఎత్తు పెంచుట, శిథిలా వ్యవస్థకు చేరుకున్న మురుగుదొడ్లును నూతన నిర్మాణం తదితర పనులన్నీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు సహాయ, సహకారంతో నిధులు కేటాయించి త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చెప్తూ ముస్లిం ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, జామియా మసీద్ ఇమామ్ మహమ్మద్ జియావుద్దీన్ రెహమాన్ (ముఫ్తీ), ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వహాబ్, మౌజన్ మహమ్మద్, జామియా మసీద్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎండి యాసిన్, కోశాధికారి మీర్ అసదుల్లా, జాయింట్ సెక్రటరీ షేక్ సలీం, అబ్దుల్ గఫార్ ఖాన్, సభ్యులు షేక్ శాన్ బాషా, అలీ భాయ్, ఎండి ఇబ్రహీం, ఎండి రఫీ, అబ్దుల్ రషీద్, ఎండి అన్వర్ భాష, హాజీ మీర్ షాదికుల్లా, హాజీ హర్షద్, హాజీ అమీరుల్లా బేగ్, హాజీ షబ్బీర్, హాజీ ఖాన్, హాజీ యాసిన్, ముబారక్, షాను, షఫీ, రోషన్ బాషా ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పలాస జిల్లా సాధనతోనే ఇచ్ఛాపురానికి వంశధార జలాలు సాధ్యం

**పలాస, మార్చి 21 (వార్త):** పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటుతోనే వెనుకబాటు తనంతో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పాటు పలాస ప్రాంతానికి వంశధార జలాలు అందివ్వడం సాధ్యమని ప్రముఖ సామాజిక వేత్త, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా) అన్నారు. శనివారం ఆయన పలాసలోని తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచిన గాని, కనీసం ఈ ప్రాంత ప్రజలకు



సాగునీరు, తాగునీరు అందడంలో పాలకులు తీవ్ర వివక్షత చూపుతున్నారని విమర్శించారు. వంశధార నదిపై నేరడి బ్యారేజీ నిర్మాణానికి అనుమతిస్తూ వంశధార ట్రిబ్యునల్ 2021 లో తుది తీర్పు ఇచ్చిందని, అదేవిధంగా కేంద్ర జల శక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు రాసినప్పటికీ, రోజురోజుకు తీవ్ర జాప్యం జాప్యం జరుగుతుంది తప్ప నేరడి వద్ద బ్యారేజ్ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం కూటమి ప్రభుత్వం కేంద్రంలో భాగస్వామ్యంగా ఉండి కూడా నిర్లక్ష్యం చూపడం సబబు కాదన్నారు. నేరడి బ్యారేజ్ వివాదం ఒడిశాతో ఉన్న అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కారం చేసుకోవడంలో ఈ ప్రాంత పాలకులు తగిన రీతిలో ఒత్తిడి తేకపోవడం వల్ల తీవ్ర నిర్లక్ష్యానికి గురికావాల్సివస్తుందన్నారు. చివరి భూములకు వంశధార సాగునీటి జలాలు అందాలంటే వంశధార స్టేజ్-2, ఫేస్ -2 పనులు యుద్ధ ప్రాతిపదిక పైన ప్రారంభించి, సకాలంలో పూర్తి చేసినప్పుడే ఉద్దానం ప్రాంత రైతులకు న్యాయం జరుగుతుందని దువ్వాడ శ్రీధర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అమరవీరుల త్యాగాలకు చిహ్నం..

# కార్గిల్ విక్టరీ పార్క్

* కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
* శ్రీకాకుళంలో రూ.2 కోట్లతో సుడా ఆధ్వర్యంలో నిర్మాణం
* అట్టహాసంగా ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

**శ్రీకాకుళం, మార్చి 21 (వార్త):** కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన జిల్లా ముద్దుబిడ్డ, అమరవీరుడు చింతాడ మోహనరావు సాహసాన్ని స్మరించుకునేలా ఈ పార్కును తీర్చిదిద్దడం గర్వకారణమని, వినోదం కోసం వైజాగ్ వెళ్లాల్సిన పనిలేకుండా జిల్లా కేంద్రంలోనే అద్భుతమైన వసతులు కల్పించామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శనివారం ఏపీహెచ్‌బీ కాలనీలో రూ.2 కోట్ల వ్యయంతో సుడా ఆధ్వర్యంలో నిర్మించిన 'కార్గిల్ విక్టరీ పార్క్'ను ఆయన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు పార్కులోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించి, స్వయంగా బ్యాట్ పట్టి బాక్స్ క్రికెట్, పికిల్ బాల్ ఆడి సందడి చేశారు. యుద్ధంలో గాయపడిన హవల్దార్ చిన్ని సింహాచలం, హవల్దార్ టొంప నీలాచలం సహా ఆ పోరులో పాల్గొన్న జిల్లాకు చెందిన 58 మంది యోధుల చరిత్రను నేటి తరం తెలుసుకునేలా పార్కులో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషమని, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీలు ఈ ప్రాజెక్టు కోసం ఎంతో కష్టపడ్డారని మంత్రి కొనియాడారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ఇది పూర్తిస్థాయిలో 'యూజర్ ఫ్రెండ్లీ' పార్కని, ఇందులో ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎల్‌సీడీ ప్రొజెక్టర్ స్క్రీన్, సోలార్ దీపాలు, స్ప్రింక్లర్ వ్యవస్థను ఏర్పాటు చేశామని వివరించారు. పార్కులోకి ప్రవేశం ఉచితం కాగా, క్రీడా కోర్టులను వినియోగించుకునే వారి నుంచి వసూలు చేసే స్వల్ప ఛార్జీలతోనే పార్కు నిర్వహణ చేపడతామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో అభివృద్ధికి ఈ పార్కు ఒక 'ట్రయల్ రన్' మాత్రమేనని, రాబోయే రోజుల్లో మరిన్ని భారీ అభివృద్ధి పనులు చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా ఇఇ సుగుణాకర్, ఇతర జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








## సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

శ్రీకాకుళం నగరంలోని రామలక్ష్మణ కూడలి నుండి పెద్దపాడు జంక్షన్ వరకూ ప్లాంటేషన్, లైటింగ్‌తో ఆధునీకరించిన నూతన రహదారిని మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ లతో కలసి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం ప్రారంభించారు. సుమారు 3.68 కోట్ల సుడా నిధులతో సెంట్రల్ లైటింగ్, డివైడర్ ప్లాంటేషన్ ఇతర బ్యూటిఫికేషణ్ వసతులను ఏర్పాటు చేశారు. రోడ్డు మొత్తాన్ని కలియతిరిగిన కేంద్ర మంత్రి.. నగరానికి ఆహ్వానం పలికే రహదారి ఇప్పుడు మరింత అందంగా తయారైందని కితాబిచ్చారు. ఇరుకు ప్రయాణాలకు స్వస్తి పలికి.. ప్రతీ జర్నీ ప్రశాంతంగా సాగేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. సెంట్రల్ లైటింగ్ కేబుల్ వ్యవస్థను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం స్వయంగా స్విచ్ ఆన్ చేసి.. సెంట్రల్ లైటింగ్ వెలుగులను ప్రారంభించారు. ఇదే తరహాలో శ్రీకాకుళంలోని అన్ని రహదారులు అభివృద్ధి చేసుకుంటూ వెళ్తామని హామీ ఇచ్చారు.

## పింక్ టాయిలెట్‌లు కూడా..

శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలిలో, ఉమెన్స్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన మహిళల కోసం ఫీడింగ్ రూమ్, పింక్ టాయిలెట్లను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్ లు ప్రారంభించారు. ప్రధాన కూడళ్ళలో మహిళల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని.. పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తూ శ్రీకాకుళం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో వీటిని నిర్మించినట్టు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇదే తరహాలో శ్రీకాకుళం నగరంలో రద్దీగా ఉన్న ప్రతీ కూడలిలో ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. చక్కగా వీటిని మేంటైన్ చేస్తూ.. మహిళలకు ఉపయుక్తంగా ఉంచాలని నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డివో సాయి ప్రత్యూష, కార్పోరేషన్ అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



# ఈద్ ముబారక్!

* జిల్లావ్యాప్తంగా ఘనంగా రంజాన్ వేడుకలు
* మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

**శ్రీకాకుళం/పలాస, మార్చి 21 (వార్త):** జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈద్ ముబారక్ అంటూ ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు చెప్పుకొని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. శ్రీకాకుళం జామియా మసీదుతో పాటు ఇతర మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ప్రజాప్రతినిధులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాశీబుగ్గలోలోని జామియా మసీదులో రంజాన్ వేడుకలు నిర్వహించారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈమాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని పలాస కాశీబుగ్గ జామియా మసీదు అధ్యక్షులు షేక్ బాషా అన్నారు.





ఇమామ్ ముక్తర్ ఆలం మాట్లాడుతూ రంజాన్ పండుగ మత సామరస్యానికి సుహృద్భావానికి సర్వమానవ సమానత్వానికి, కరుణ దాతృత్వానికి ప్రతీకని అన్నారు. ఈ కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ జామియా మజీద్ ప్రెసిడెంట్ షేక్ బాష, సెక్రటరీ బషీర్, ఇమామ్ ముక్తార్ అలామ్, జిలాని, గౌస్, సాహిద్, తమీమ్, ఖాసీం, ఖాదర్, రాజేష్ ఖాన్,పప్పు, ఫిరోజ్, బబ్లు, ఫకీర్, అబ్దుల్లా ఖాన్, అబ్దుల్లా సీలింగ్, ఫిర్దోష్ ఖాన్, మహమ్మద్ షమ్మీ, జామియా మజీద్ పెద్దలు, జామియా మసీద్ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546